# బామ్మ భాష

కనకదుర్గగారికి ఎనభై ఏళ్లు నిండాయి. చిన్నప్పటినుంచీ అన్నీ మంచి అలవాట్లే. కాఫీలు, టీలు లాంటివి తాగదు. ప్రొద్దునే ఓ అరలీటరు పాలు తాగుతుంది. అవి కూడా ఇంటి దగ్గర ప్రత్యక్షంగా పితికిన ఆవుపాలే తాగుతుంది. ఆచార వ్యవహారాలు పాటించడంలో దిట్ట. ఓసారి ఎవరో గుమ్మపాలు తాగితే మంచిదని చెప్పారు.

"ఆవుపాలు పవిత్రమైనవి. గుమ్మపాలు మంచివే. పితికిన పాలు పితికినట్లు తాగకుండా, కాచుకుని తాగితే పవిత్రమైన అగ్నిసెగ తగిలి అవి ఇంకా పునీతమవుతాయి. అందుకని నేను గుమ్మపాలు తాగను" అంది.

పాపం... కనకదుర్గగారి భర్త గతించాడు. తర్వాత ఆమెకి ఉన్న ఒక్కగానొక్క కొడుకు కూడా గతించాడు. ఈమె మనవడు భాగ్యనగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. మామ్మగారంటే ఇతనికి చాలా ప్రేమ.

"మామ్మా! ఈ పల్లెటూరిలో ఈ ఒంటరి జీవితం ఎందుకే. హైదరాబాద్‌కి వచ్చి నా దగ్గర ఉండు. నీకేం లోటు లేకుండా చూసుకుంటాను" అని అనేకసార్లు చెప్పాడు. కనకదుర్గగారు వినలేదు. మనవడి కోరిక మన్నించక పోవడంవల్లనో, పెరట్లో చిత్తడి ఎక్కువగా ఉండడంవల్లనో తెలీదుగానీ ఓసారి కాలుజారి పడింది కనకదుర్గ. మనవడు వచ్చి వైద్యం చేయించాడు. "హైదరాబాద్ వస్తే మంచి వైద్యం అందుబాటులో వుంటుంది, తనతో రమ్మని" చెప్పాడు. ఇరుగుపొరుగూ "మీ మనవడి కోరిక తీర్చడం మీ ధర్మం" అని చెప్పారు. కనకదుర్గ మనవడితో బయల్దేరింది.

కనకదుర్గగారు కాలు కిందపెడితే మళ్లీ పడిపోతుందేమోనన్న భయంతో కాబోలు, మనవడూ, అతని భార్యా, ఆమె కాలు కింద పెట్టకుండా సకల సౌకర్యాలతో బామ్మను చూసుకుంటున్నారు. బామ్మగారి అలవాటు ప్రకారం ప్రొద్దునే ఓ అరలీటరు పాలు ఆమెకి ఇస్తున్నారు. కొన్నాళ్ల తరువాత తాగే పాలలో ఏదో కొంత తేడా కనిపించింది బామ్మగారికి. ఓరోజు మనవడు తన భార్యతో "పాలు తాగేటప్పుడు మా బామ్మ తన మొహం అదోలా పెడుతోంది. ఆ బూత్ పాలు ఆమెకి హితవుగా ఉన్నట్లులేదు. అందుకని మనం పితికించుకుంటున్న పాలే మా బామ్మకి తాగిద్దాం" అన్నాడు.

"ఏదో ముసలావిడ కదా అని అన్నీ జాగ్రత్తగా చేసి పెడుతున్నాను. ఆమె నిత్యకృత్యాలకి ఏమీ లోటులేదు. రోజూ ఓ అరలీటరు బూత్‌పాలు వారాయించుకుంటోంది. పితికిన పాలు పిల్లల్ని తాగనివ్వండి" అంది మనవడితో భార్య. ఆ 'బూత్' అన్న మాట బామ్మగారి చెవిన పడింది. కావాలని నన్ను ఆ పల్లెటూరి నుంచి తీసుకొచ్చి నాకు 'బూతు పాలు' పట్టిస్తున్నారన్నమాట. ఎంత ఘోరం. ఇన్నాళ్లూ నేను పాటిస్తున్న ఆచార వ్యవహారాలు మంట కలిపేసారు. అసలు అందుకే ఆ పాలు తాగడానికి నా మనస్సు అంగీకరించలేదు. ఇక్కడ ఇక ఒక్క క్షణం కూడా ఉండను. ఆ పల్లెటూరికి

పోయి పవిత్రమైన ఆ పితికిన పాలే తాగుతాను. ఇన్నాళ్లూ ఇక్కడ బూతు పాలు తాగినట్లు ఎవ్వరికీ తెలియకుండా వుంటే అదే పదివేలు. లేకపోతే నా పరువు పోతుందని" చెప్పి మనవడిని ఒప్పించి మళ్లీ తన స్వస్థలానికి వచ్చేసింది.

పల్లెటూరికి వచ్చేసిన ఆరునెలలకి బామ్మ మళ్లీ పడిపోయింది పెరట్లో.! మంచివాడైన మనవడు మళ్లీ వచ్చేసాడు.

"ఇక్కడుంటే ఏ దెయ్యమో నిన్ను తోసేసి కింద పడకొట్టేస్తోంది. మళ్లీ హైదరాబాద్ వచ్చేయ్" అన్నాడు. బామ్మ ఉగ్రురాలైపోయింది.!

"నీ వెధవ వేషాలు నా దగ్గర కట్టిపెట్టు. ఇక్కడ కళ్లముందు పితికిన పాలు తాగుతుంటే హైదరాబాద్ తీసుకుపోయి నువ్వు భార్యా సమేతంగా నాకు "బూతు పాలు" పట్టిస్తావా? మహానుభావుడు మీ తాతకి బూతులంటే పరమ అసహ్యం. ఎవరైనా బూతులు మాట్లాడడం మొదలుపెడితే 'నారాయణ...నారాయణ' అని చెవులు గట్టిగా మూసేసుకునేవారు. ఆ బూతులోని మొదటి అక్షరం విని అపవిత్రమై పోయామని పసుపు నీళ్లతో స్నానం చేసేవారు. అటువంటి పవిత్ర పురుషునితో అరవై సంవత్సరాలు కాపురం చేసిన నాకు "బూతు పాలు" పట్టిస్తారా? మీకు మహాపాపం ప్రాప్తిస్తుంది."

ఇంగ్లీష్ 'బూత్'ని తెలుగు 'బూతు' అనుకుంటున్న బామ్మకి ఏం చెప్పాలో తెలియక "నీకు ఇచ్చిన పాలు మంచివేనే బామ్మా" అన్నాడు.

"మంచివైతే ఆ పితికిన పాలు నాకిచ్చి ఆ పాలు మీరు తాగొచ్చు కదా" "నీకు" నీరసంగా ఉంటుందని తెల్లారగట్ల వచ్చిన పాలు నీకిచ్చేవాళ్లం"

"ఇక చస్తే నీ దగ్గరకు రాను. ఆ బూతు పాలు మీరే తాగుతారో, ఎవరైనా అమాయకులకి పట్టిస్తారో మీ ఇష్టం. నేను తొందర్లోనే కాశీ వెళ్ళి ప్రాయశ్చితం చేసుకుని, చేసిన తప్పుకి ఉపశమనం పొందుతాను."

"చెయ్యని తప్పుకి తిట్లు తిని బాధపడడం కూడా ఓ అనుభూతు" అన్నాడు మనవడు.

"ఇంగ్లీషు మీడియంలో చదివి ఏడిస్తే ఇలాగే వుంటుంది. ఆ పరాయి భాష వంట పట్టదు. మన మాతృభాష తెలియదు. మళ్లీ "అనుబూతు" అంటూ భాషాపరమైన ఓ బూతు మాట మాట్లాడేవ్. అది 'అనుబూతు' కాదు 'అనుభూతి' . ఓ చక్కని తెలుగు పదాన్ని ఓ బండ బూతుగా మార్చావ్. మన వంశంలో చెడపుట్టావ్" అంది బామ్మ.

"అంతా నా కర్మే. నారాయణ అంటే బూతయిపోతోంది" అని మళ్లీ హైదరాబాద్ వచ్చేసాడు మనవడు. తన భార్యకి వివరాలు విశదీకరించాడు.

"మీ బామ్మ లెక్క ప్రకారం 'బూత్' అంటే 'బూతు'. మనం ఆవిడకి ఇచ్చినవి బూతు పాలు. ఎవరైనా టెలిఫోన్ బూత్‌లో మాట్లాడిన మాటలు బూతు మాటలు. ఆవిడ్ని ఏ ఇంగ్లీషు మీడియం స్కూల్లోనైనా వెయ్యండి". అతని భార్య.

"వద్దులే. ఈసారికి పోనీ. ఇప్పుడు గొన్లు తొడుక్కునే వయస్సుకాదు ఆవిడది" అన్నాడు మనవడు.

(ఆంధ్రభూమి మాసపత్రిక ఏప్రియల్ 2012)